క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో కొలువై ఉన్న ఎర్ని మాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులకు ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ లండా రమణ, సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ వసంతలక్ష్మి తదితరులు

దాబాగార్డెన్స్: నాట్యదీపిక కూచిపూడి అకాడమీ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహించిన కూచిపూడి వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారంతో ముగిసాయి. శిబిరంలో నాట్యదీపిక కూచిపూడి అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్ ఎల్. ఇంద్రాణి నరేంద్ర రెడ్డి నేతృత్వంలో విద్యార్థులు కూచిపూడి, భరతనాట్యం, కోలాటం, సెమీ క్లాసికల్, ఫోక్ డ్యాన్స్‌లో తర్ఫీదు పొందారు. ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని ప్రేమసమాజం వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు ప్రతిభ చూపారు. స్థానిక కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి పాల్గొని చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య నేర్పించిన గురువు ఇంద్రాణి నరేంద్రెడ్డికి, ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చిపెట్టాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉన్నతంగా చదవి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అభిలషించారు. కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల పిల్లలకూ 'తల్లికి వందనం' ఇవ్వాలి



రైల్వేస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న వామనమూర్తి, ఆటో డ్రైవర్లు

తాటిచెట్లపాలెం: ఆటోడ్రైవర్ల పిల్లలకూ తల్లికి వందనం వర్తింపజేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం రైల్వేస్టేషన్ పోస్టాఫీసు జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వామనమూర్తి మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే ఇంట్లో ఎందరు పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం రూ. 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి నేడు కరెంటు బిల్లు 300 యూనిట్లు దాటిన వారికి, ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన ఆటో డ్రైవర్లకు ఈ కరెంటు బిల్లు లింకు సాకు చూపి తల్లికి వందనం ఎగ్గొట్టడం, మొండిచేయి చూపడం అన్యాయమన్నారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. విశాఖలో ఈ నెల 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముందే ఆటో డ్రైవర్ల పిల్లలకు తల్లికి వందనం డబ్బు బ్యాంకుల్లో వేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో స్టాండ్ అధ్యక్షుడు వై. వెంకట్, రవి, కృష్ణ, రమేష్, రాజేష్, గణేష్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు శాంతి కలగాలి

మద్దిలపాలెం: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారికి శాంతి కలగాలని కోరుతూ ఆదివారం హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లో బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరపత్రాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కార్యదర్శి ప్రకాశరావు మాట్లాడుతూ ఈ సంఘటన దురదృష్టకరమన్నారు. చనిపోయిన వారి ఆత్మలకు శాంతి కలగాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ బాబి, బి.గణేష్, పి.ఎస్.వి. కుర్నేష్, డి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



స్క్రాప్ వాహనాలకు అడ్డాగా మారిన గాజులవీధి



స్థానికులు నిత్యం ఆరుబయటే ఉండే పండా వీధి

ఆక్రమణలతో.. అవస్థలు

- పద్మవ్యూహాన్ని తలపిస్తున్న పూర్ణామార్కెట్‌లోని ఆయిల్‌మిల్లు వీధి, పండా వీధి, గాజుల వీధి, మంచాల వీధి
- వీధుల్లోనే తోపుడుబళ్లు, చిరువ్యాపారుల కార్యకలాపాలు
- సరకుతో వచ్చే భారీ వాహనాలు.. వినియోగదారుల టూ వీలర్లతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



విపరీతమైన ట్రాఫిక్‌తో నిండి ఉండే ఆయిల్‌మిల్లు వీధి

జగదాంబ: పూర్ణామార్కెట్ పరిసరాల్లోని వీధులు ఆక్రమణలకు గురవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడి ఆయిల్‌మిల్లు వీధి, స్ప్రింగ్ రోడ్డు, ప్రసాద్‌గార్డెన్స్, పండావీధి, గాజులవీధి, బౌడారా రోడ్డు తదితర ప్రాంతాలు లారీలు, వ్యాన్లు, ద్విచక్ర వాహనాలతో నిండిపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చుట్టుపక్కల నివసించే వారు చెబుతున్నారు. వన్‌టౌన్ నుంచి నగరానికి వెళ్లే ప్రధాన రహదారి, బ్యారెక్స్ రోడ్డు నిత్యం ఆక్రమణలకు గురై తీవ్రమైన రద్దీ ఏర్పడుతోంది. ప్రధానంగా స్ప్రింగ్ రోడ్డు, పండావీధి, అయిల్‌మిల్లు వీధుల్లో హోల్‌సేల్ దుకాణాలు ఉండడం వల్ల విపరీతమైన రద్దీ ఏర్పడుతుంటుంది. ఈ ప్రాంతాలకు అత్యవసర పరిస్థితులు వచ్చి అంబులెన్స్ రావలన్నా సాధ్యం కాదని స్థానికులు వాపోతున్నారు.

పండావీధి..

ఇక్కడ స్థానికులు, చిరు వ్యాపారులు ఇళ్లలో కంటే బయటే ఎక్కువగా ఉంటారు. అడ్డదిడ్డంగా తోపుడు బళ్లు, వాహనాల పార్కింగ్‌తో పండా వీధి నిత్యం గందరగోళంగా ఉంటుంది. దారిలో చిరు వ్యాపారాలు, స్క్రాప్ దుకాణాల నిర్వహణతో అమ్మకందారులు, కొనుగోలుదారులతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. ఇక్కడున్న క్యాటరింగ్ వ్యాపారుల వంటకాలు ఆరుబయటే జరుగుతుంటాయి. అలాగే స్క్రాప్ దుకాణాల పాత వాహనాలు, ఇతర సామగ్రి అంతా ఆరుబయటే డంప్ చేసి ఉంటుంది. ఇలా ఈ వీధి ఎప్పుడు చూసినా బిజీగా, రణగొణ ధ్వనులతో ఉంటుంది.

స్ప్రింగ్‌రోడ్డు..

పూర్ణామార్కెట్‌లో అత్యంత కీలమైన హోల్‌సేల్ మార్కెట్ ఇక్కడే ఉంది. పోలీస్ కమిషనర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉండే ఈ మార్కెట్‌లో చిరు వ్యాపారులు నచ్చినట్లు తమ సామగ్రిని రోడ్డు మీదే పెట్టి విక్రయాలు సాగిస్తుండడంతో అంతా గందరగోళంగా ఉంటుంది. ఈ రద్దీ వల్ల మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

మంచాల వీధి..

వన్‌టౌన్ నుంచి నగరంలోకి వచ్చే ప్రధాన రహదారి ఇదే. ఇక్కడ పాత బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా కర్రకు సంబంధించిన వస్తువులు రహదారిపై అడ్డంగా పెట్టడం వల్ల నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్రమణలు తొలగించినా అవి మళ్లీ యథాతథంగా రోడ్డు పైనే దర్శనమిస్తుంటాయి. ఇదిలా ఉంటే ఇక్కడున్న ఇందిరా మున్సిపల్ స్టేడియం ప్రహరీ, ఫుట్‌పాత్ మొత్తం కర్ర పనులు చేసేవారు, స్క్రాప్ వ్యాపారులు ఆక్రమించుకుని తమ కార్యకలాపాలు నిర్వహించుకుంటూ ఉంటారు. ఈ విధంగా విపరీతమైన రద్దీ, ట్రాఫిక్ సమస్యతో సతమతమయ్యే పూర్ణామార్కెట్ చుట్టుపక్కల ప్రాంతాల సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

40 అడుగుల రహదారి..

అయిల్‌మిల్లు వీధి 40 అడుగులకు విస్తరించి ఉంటుంది. కానీ నడిచేందుకు కూడా వీల్లేని పరిస్థితి ఇక్కడ ఉంది. రహదారి అంతా వాహనాలతో ఈ ప్రాంతం ఇరుగ్గా మారిపోతుంది. ఇక్కడి దుకాణాలకు సరుకు తీసుకొచ్చే వాహనాలతో పాటు సామగ్రి కొనుగోలుకు వచ్చే వినియోగదారుల వాహనాలతో స్థానికంగా నివసించే వారు రాకపోకలు సాగించేందుకు వీల్లేకుండా ఉంటుంది.



చెక్క సామగ్రితో రాకపోకలకు వీల్లేకుండా ఉండే మంచాల వీధి

వివేకానంద ఆశ్రమవాసుల కాశీయాత్ర



కాశీకి పయనమైన ఆశ్రమ వాసులు

దాబాగార్డెన్స్: స్వామి వివేకానంద ఆశ్రమ వాసులు కాశీ పుణ్యక్షేత్రానికి బయలుదేరి వెళ్లారు. ప్రతి సంవత్సరం దాతల సహకారంతో వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు ఆశ్రమ వాసులను ఆధ్యాత్మిక యాత్ర కింద కాశీ, రామేశ్వరం వంటి పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్తుంటారు. ఈ ఏడాది వాల్తేర్ రగల్స్ రౌండ్ టేబుల్ సభ్యుల సహకారంతో ఆశ్రమ వాసులను కాశీ పుణ్యక్షేత్రానికి తీసుకెళ్తున్నట్టు అప్పారావు చెప్పారు. కాశీకి వెళ్లడానికి, రావడానికి ఖర్చులతో పాటు అక్కడ వసతి కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వీరంతా ఆదివారం వేకువ జామును విశాఖ రైల్వేస్టేషన్ నుంచి పయనమయ్యారు. ఈ సందర్భంగా సంస్థ ఆంధ్ర, తెలంగాణ చైర్మన్ మక్సూద్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మేదర్ల సంఘం ప్రమాణ స్వీకారం

జగదాంబ: రాష్ట్ర మేదర్ల సంఘం ప్రమాణ స్వీకారం ఆదివారం పూర్ణామార్కెట్ దరి క్రాంతి ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ మేదరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గ్రంధి రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా పోలేపల్లి నాగరాజు, కోశాధికారిగా తెల్లి వైకుంఠరావు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్రంలో మేదర్ల హక్కుల సాధనకు పోరాడతానన్నారు. ప్రతి జిల్లా, గ్రామంలో వెదురుపై ఆధారపడి పనులు చేసుకుంటున్న మేదర్లకు ఫారెస్టు డిపార్టుమెంట్ నుంచి ఇబ్బందులు లేకుండా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అలాగే ప్రతి జిల్లాలో మేదర్లకు కమిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి భారీ సంఖ్యలో మేదర్లు హాజరయ్యారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న కనకమహాలక్ష్మి ఆలయ సిబ్బంది



యోగా చేస్తున్న వైద్యులు

దాబాగార్డెన్స్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం యోగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ యోగా అధ్యాపకుడు పైడెం నాయుడు బృందం 21 రకాల యోగాసనాలు వేయించి, వాటి ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కె.శోభారాణి మాట్లాడుతూ భారతదేశం అందించిన అద్భుతాల్లో యోగా ఒకటని, యోగాను ప్రతి ఒక్కరూ నిత్యం సాధన చేసి ఆరోగ్యంగా ఉందామని తెలిపారు. ఈ నెల 21న నిర్వహించనున్న యోగా కార్యక్రమంలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ యోగా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో యోగభారతి ట్రస్ట్ వ్యవస్థాపకుడు పైడం నాయుడు, సహాయ కార్య నిర్వహణాధికారులు కె.తిరుమలేశ్వరరావు, కె.రాజేంద్రకుమార్, సహాయ ఇంజినీర్లు డీవీఎస్ రామరాజు, కేఎస్ఎన్ మూర్తి, సూర్యారావు, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, శ్రీహరి సేవా సంఘం, యోగభారతి ట్రస్ట్ సభ్యులు, శ్రీవరాహలక్ష్మీ నరసింహ వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మెడిసి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో వైద్యులతో కలిసి యోగాసనాలు వేశారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ నెల 21న విశాఖలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు తెలిపారు. మెడిసి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శిరీరాణి మాట్లాడుతూ వైద్యులంతా కలిసి యోగాడేలో పాల్గొనడం సంతోషకరమన్నారు.

ఫాదర్లకు వీడ్కోలు



ఫాదర్లను సత్కరిస్తున్న జ్ఞానాపురం ప్రజలు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పారిస్ విచారణ కర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో సహాయ విచారణకర్తలకు ఆదివారం ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ మేరకు వైజాగ్ ఆర్చ్ డయాసిస్ క్యాథెడ్రల్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు వేడుకల్లో ఏడాది కాలం పాటు పని చేసి జ్ఞానాపురం ప్రజల మన్ననలు చూరగొన్న సహాయ విచారణ కర్తలు రెవరెండ్ ఫాదర్లు వినయ్‌కుమార్, అంథోనీ రాజ్‌లను ఘనంగా సత్కరించారు. ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రభువు సువార్తను బోధించుటలో చిత్తశుద్ధి, అంకితభావంతో వీరు పనిచేసి, అధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిపూర్వకంగా జరగడానికి ఎంతో సహకరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రంగస్థల కళాకారులు, వ్యాఖ్యాత పొలమరశెట్టి ఫ్రాన్సిస్, పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) అధ్యక్షుడు ముసురు రాజేష్‌బాబు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డీఈవోకు సత్కారం



డీఈవో ప్రేమ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఆరిలోవ: జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్‌ను డీఈవో కార్యాలయంలో ఆదివారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్‌ను విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా డీఈవోను ఘనంగా సత్కరించి అభినందించారు. ఇటీవల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అన్ని ఉపాధ్యాయ సంఘాలు, విద్యా శాఖాధికారులు, సిబ్బంది సహకారంతో కౌన్సెలింగ్ ప్రశాంతంగా నిర్వహించగలిగామన్నారు. కార్య క్రమంలో విశాఖపట్నం, అనకాపల్లి డీసీఈబీ సెక్రటరీలు ఎం. వి.కృష్ణకుమార్, సత్యనారాయణ, ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు, ఉపాధ్యక్షుడు జి.వరహాల దొర, పీడీ అసోసియేషన్ అధ్యక్షుడు లలిత్‌కుమార్, స్కూల్ గేమ్స్ సెక్రట రీ దేముడు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి నడక పోటీలు



నడక పోటీలు ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

కంచరపాలెం: ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీ స్టార్స్ వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి సర్వోత్తమ సుకుమార్, అధ్యక్షుడు జయతి ఉమామహేశ్వరరావు నేతృత్వంలో జిల్లా స్థాయి 4కే-2025 నడక పోటీలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వాకర్స్ డిస్ట్రిక్ట్ 101 ఇంటర్నేషనల్ గవర్నర్ కె. ద్వారకానాథ్ పాల్గొని జెండా ఊపి నడక పోటీలను ప్రారంభించారు. 30 ఏళ్ల నుండి 80 ఏళ్ల వయసు కలిగిన సుమారు 265 మంది స్త్రీ, పురుషులు పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ముందుగా ఇంటర్నేషల్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు స్వర్గీయ సుంకరి ఆళ్వార్ దాస్, ప్రముఖ సామాజిక సంస్కర్త, ఆధ్యాత్మికవేత్త రౌతు ఆదినారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నడక పోటీల్లో విజేతలకు త్వరలో జరిగే వార్షికోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు జె. రమేష్‌కుమార్, కార్యదర్శి కాళ్ల వెంకటప్రసాద్, కోశాధికారి కిషోర్‌కుమార్, సహ కార్యదర్శి ఇమ్మానుయేల్, శిలపరశెట్టి సూర్యారావు, లక్ష్మిరెడ్డి, డాక్టర్ కె.రామకృష్ణ, బి.శ్రీధర్, శివ కామేశ్వరి, డాక్టర్ ఎస్.బి.సంతోష్ కమిటీ బోర్డు కో-ఆర్డినేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనా సంఘీభావ సభ విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న జగ్గునాయుడు

దాబాగార్డెన్స్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ అమానుష దాడి, మానవ హననాన్ని నిరసిస్తూ ఈ నెల 17న రాష్ట్ర వ్యాప్తంగా పాలస్తీనా సంఘీభావ దినం పాటించాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. దీనిలో భాగంగా విశాఖ జిల్లాలో ఆ రోజు ఉదయం 10 గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్ గురజాడ విగ్రహం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించి, అనంతరం నిర్వహించనున్న సభలో పాల్గొనాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు పిలుపునిచ్చారు. జగదాంబ జంక్షన్ సమీపాన సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహ్మాన్, సీపీఐఎంఎల్ ప్రజా పోరు కార్యదర్శి కె.దేవసహాయం, సీపీఎం కార్యదర్శి బి.పద్మ, పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.మన్మథరావుతో కలిసి మాట్లాడారు. ప్రపంచ పటం నుంచి పాలస్తీనా దేశాన్ని తొలగించాలనే కుట్రతో ఇజ్రాయిల్ దాడులు చేస్తుందని, పిల్లలు, మహిళలతో సహా వేలాది మందిని బలి తీసుకుంటుందని, ఆస్పత్రులు, విద్యా సంస్థలు, శరణార్థుల శిబిరాలు వేటినీ వదలడం లేదని తెలిపారు. ఈ మారణ హోమాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పాలస్తీనా, ఇజ్రాయిల్ రెండింటిని స్వతంత్ర దేశాలుగా గుర్తించడమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారమని అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మన దేశం అలీన విధానానికి కట్టుబడి, పాలస్తీనాకు అండగా నిలుస్తోందని తెలిపారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దానికి తూట్లు పొడుస్తూ అమెరికన్ సామ్రాజ్యవాదానికి వంత పాడుతుందన్నారు. ఇది దేశ ప్రయోజనాలకు విఘాతమని, వెంటనే అటువంటి వైఖరిని విడనాడాలని డిమాండ్ చేశారు.

ప్రజాధనం వృథా

- రోడ్డు వేసిన ఆరు నెలలకే తవ్వేస్తున్న వైనం
- అధికారుల నిర్లక్ష్యంపై విమర్శల వెల్లువ





వివేకానంద కాలనీలో యూజీడీ పనులు చేపడుతున్న దృశ్యం
పక్కనే గత అక్టోబర్ 7న అప్పటి మేయర్ హరి వెంకటకుమారి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

అల్లిపురం: జీవీఎంసీ అధికారులకు ప్రజా ధనమంటే అంత అలుసా అని 33వ వార్డు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ 7వ తేదీన అల్లిపురం రోడ్డు, వివేకానంద కాలనీ, కుమ్మరివీధిలో బీటీ రోడ్ల అభివృద్ధికి సుమారు రూ.39.72 లక్షలు జీవీఎంసీ నిధులతో అప్పటి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శంకుస్థాపన చేశారు. తర్వాత బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గత మూడు రోజులుగా అదే రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల నిమిత్తం పొక్లెయిన్‌తో తవ్వకాలు మొదలు పెట్టారు. పనులు కొనసాగుతున్నాయి. దీంతో వార్డు ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బీటీ రోడ్డు వేసిన కొద్ది నెలలకే రోడ్డు తవ్వేయటంతో ప్రజాధనం వృథా అవుతుందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూజీడీ పనులు మంజూరు అయిన తర్వాత బీటీ రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచిన సంగతి అధికారులకు తెలియదా అని ప్రశ్నిస్తున్నారు. యూజీడీ పనులు చేపట్టిన తర్వాత రోడ్డు పనులు చేపడితే ప్రజాధనం వృథా అయి ఉండేది కాదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కమీషన్ల కోసమా లేక కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకా ఈ విధంగా అధికారులు ప్రవర్తిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పద్మశాలి గ్లోబల్ యాప్‌తో అభ్యున్నతి

సీతంపేట: పద్మశాలీల అభ్యున్నతికి పద్మశాలి గ్లోబల్ యాప్ ఎంతో ఉపయోగపడే డిజిటల్ వేదిక అని పద్మశాలి గ్లోబల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మేరువ వెంకటేశ్వర్లు, స్వాతి సైన్స్ ఒంగోలు చైర్మన్ కవరతపు ప్రసాదరావు, రోఎస్‌ఐటీ సొల్యూషన్స్ డైరెక్టర్ గోలి తిరుపతిరావు, కర్నూలు మాజీ ఎంపీ సింగరి సంజీవ్ కుమార్ అన్నారు. శంకరమఠం రోడ్‌లో ఉన్న పద్మశాలి భవన్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో పద్మశాలి గ్లోబల్ యాప్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని పిలుపు నిచ్చారు. పద్మశాలి గ్లోబల్ యాప్ ఆవిష్కరణ గర్వకారణమైన విషయమన్నారు. ఈరోజు నుంచి పద్మశాలి చరిత్రలో కొత్త అధ్యాయం మొదలవుతుందని తెలిపారు. భౌగోళిక సరిహద్దులు చెరిపేసి గ్లోబల్ పద్మశాలి కుటుంబ నిర్మాణానికి దోహదపడిన రోజని పేర్కొన్నారు. నాటి మగ్గం నుంచి నేటి సాంకేతిక విజ్ఞానం దాకా పద్మశాలీయుల ప్రతిభ సమాజానికి సేవ చేస్తోందన్నారు. ఈ యాప్ ద్వారా పద్మశాలి కులస్తుల సాధికారత, వివాహ సంబంధాలు, వేడుకలు, అభిప్రాయ సేకరణ, ఎన్నికల నిర్వహణ, సమస్యల పరిష్కారం, పేద పద్మశాలి కుటుంబాలకు సహాయం, పద్మశాలి సంస్కృతి రాబోయే తరానికి అందిచండం లక్ష్యంగా యాప్ సేవలందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి నాయకులు పప్పు రాజారావు, సూరిశెట్టి సూరిబాబు, బురిడి కల్యాణి, కొప్పుల రమేష్ వానపల్లి ఈశ్వరరావు, రాపర్తి సుబ్బారావు, కొప్పుల రామ్‌కుమార్, కోడిదాసు శ్రీనివాసరావు, పలువురు పద్మశాలి సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సాగరిగిరి కనకదుర్గ ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో శ్రీ సాగరిగిరి కనకదుర్గమ్మ



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: యారాడ కొండపై వెలసిన శ్రీ సాగరిగిరి కనకదుర్గ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి పంచామృతాభిషేకాలు చేపట్టారు. ఆలయ ఆవరణలో వెలసిన శివాలయంలో ఈశ్వరుడికి రుద్రాభిషేకం జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

శ్రావ్యంగా గాత్ర సంగీత కచేరీ



గాత్ర కచేరీ చేస్తున్న రమ్య కిరణ్మయి బృందం

మద్దిలపాలెం: త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ కార్యక్రమాల్లో భాగంగా వాగ్గేయకారుల జయంత్యుత్సవాల సందర్భంగా ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గాత్ర విద్వాంసురాలు రమ్య కిరణ్మయి గాత్ర సంగీత కచేరీ శ్రావ్యంగా సాగింది. వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, రాంబాబులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రమ్య కిరణ్మయి పలు త్యాగరాజు కీర్తనలు అద్భుతంగా ఆలపించి పరవశింపజేశారు. సుబ్బరాయ శాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్ తదితర వాగ్గేయకారుల కృతులను పాడి సమ్మోహన పరిచారు. కార్యక్రమంలో వయొలిన్ విద్వాంసుడు 'సంగీత కళాభారతి' బిరుదాంకితుడు ఎం.ఎస్.ఎన్.మూర్తి వయొలిన్‌పై వాయించడం కచేరీకి వన్నెతెచ్చింది.